'ఆఖరిసారిగా చెప్తున్నాను బాగా ఆలోచించు! ప్రమోషన్ వదులుకోమని నేను చెప్పలేను! కాని ఒక్క సంవత్సరం ఆగితే ఆ సన్యాసయ్యగారు రిటైర్ అవుతారు. అప్పుడు ఆ ప్రమోషనేదో నీకే వస్తుంది! ఈ స్వంతఇంటిని ఈ వయస్సులో మమ్మల్ని విడిచి వెళ్ళిపోవడం అంతమంచిదికాదు!" అన్నాడు రామ్మూర్తి కొడుకు సుధాకరంతో.

సుధాకరం ఓసారి తండ్రిముఖంలోకి చూసి, చిన్నగా నవ్వి, "నాన్నగారు ఉద్యోగాలనేవి మనకి కావలసినప్పుడు కావలసినచోట లభిస్తాయా? అందునా ప్రమోషన్ రావడం మరీ కష్టం!" సూట్‌కేస్‌లో బట్టలు సర్దుకుంటూ అన్నాడు.

నిరాశ నిండుకుంది రామ్మూర్తి ముఖంలో. "ఎన్నిచెప్పినా కొడుకు తన మాట వినే పరిస్థితిలో లేడు!" ఇంతవరకూ కొడుకుని వదిలి ఒక్కక్షణం కూడా లేదు తను. ఈనాడు ఇలా దూరంగా వెళ్ళిపోతున్నాడంటే ఎంతో బాధగా వుంది.

అక్కడికి కొంచెం దూరంలో క్రింద కూచుని చేటలో బియ్యంపోసి ఏరుతున్నది సావిత్రమ్మ కొడుకు వెళ్ళిపోతు

# పునరావృతం

## కె. శీయళారమ్మ



న్నందుకు ఆమె మనస్సుకూడా బాధతో వేగిపోతున్నది. ఇంతవరకూ కోడలు అన్ని పనులలోను చేదోడు వాదోడుగా వుంటున్నది. మనుమలిద్దరు కలివిడిగా సందడిగా వుంటున్నారు ఇంట్లో. ఇటుపై తామిద్దరూ ఒంటరిగా ఎలా గడపాలో?" సావిత్రమ్మ కన్నులనుండి నీరు జాలు వారింది.

"పద్మినీ నువ్వయినా చెప్పమ్మా నీ భర్తతో ఈ ట్రాన్స్‌ఫర్ ఆపించుకో మని!" కోడలికి దగ్గరగావచ్చి అన్నాడు రామ్మూర్తి.

కోడలు మౌనం వహించింది.

సావిత్రమ్మ కోడలి ముఖంలోకి ఓసారి చూసి అంతలోనే నిరాశను పొందింది. కోడలిలో ఏదోమార్పుని గుర్తించింది. ఇంతవరకూ తను కోడల్ని కన్న కూతురిలా చూసింది. ఆమెకేం తక్కువ చేసింది తను? ఈ సాంఘిక వ్యవస్థలో అత్తమీద కోడలికి ఇంతకంటే మంచి అవగాహన కలగదేమో?"

"సామాన్లన్నీ సర్దుకోవడం పూర్త య్యింది. ఇక బయలుదేరదామా పద్మినీ!" అన్నాడు సుధాకరం.



పిల్లలిద్దరూ ఉత్సాహంగా ఉన్నారు.

"ఒరే సిరీ. ఒసే చిన్నీ ఈ మామ్మని తాతయ్యనీ వదిలి ఉండగలరా?" అంది సావిత్రమ్మ. మనుమలిద్దర్నీ దగ్గరకు తీసుకుని.

"ఓఁ విజయవాడ ఎంతో బావుంటుంది! ఇక్కడ ఏమీ బాగోదు!" అన్నారు పిల్లలిద్దరు. వాళ్ళకి కొత్తచోటు చూడాలన్న కోరిక బలంగా నాటుకుపోయింది.

గాఢమైన నిట్టూర్పు వెలువడింది సావిత్రమ్మ దంపతులనుండి,

నీటిపొరలు కమ్మినకళ్ళకి బియ్యటంలో రాళ్ళు కనుపించడం లేదు. చేట లోపల పెట్టివచ్చింది.

సుధాకరం హడావిడిగా రిక్షాలు పిలుచుకు వచ్చాడు. ఒ దాన్లో సామాన్లు ఎక్కించి, రెండోదాన్లో పిల్లలు, తాము ఎక్కారు.

"వెళ్ళగానే ఉత్తరంరాయి అబ్బాయ్" అన్నాడు రామ్మూర్తి గొంతులో బాధ సుడులు తిరుగుతుండగా.

"అలాగే నాన్నగారూ!" అన్నాడు సుధాకరం. అతని గొంతులో తల్లితండ్రుల్ని విడిచి వెళ్ళిపోతున్నానన్న బాధ లేశమైనా కనుపించలేదు రామ్మూర్తికి. అతని పితృహృదయం అంతులేని ఆవేదనని అనుభవించింది.

"అమ్మాయ్ ఇవిగో ఇవి తీసుకో!" అంటూ రెండు ఊరగాయ సీసాలు అందించింది సావిత్రమ్మ కోడలి చేతికి

"వస్తాం అత్తయ్యగారూ!" అంది ద్మని సీసాలు అందుకుంటూ

"పిల్లలు జాగ్రత్త అమ్మాయ్! అసలే విజయవాడలో ఎండలు జాస్తి!" అంది సావిత్రమ్మ.

రిక్షాలు కదిలాయి.

నిరాశా నిస్పృహాలు నిండిన మనసులతో లోపలికి నడిచారు రామ్మూర్తి సావిత్రమ్మ కూడా.

ఆ ఇంటిని ఏదో శూన్యం ఆవరించినట్టయ్యింది. బోరుమంటోంది.

"తను సుధాకరానికేం తక్కువ చేశాడు? వాడి నిర్ణయం తీసుకోవడంలో గల అంతరార్థం?"


రామ్మూర్తిని పీడిస్తున్న ప్రశ్న ఇదే.

ఎందరి కాళ్ళో పట్టుకుని ఉన్న ఊర్లోనే ఉద్యోగం వేయించాడు సుధాకరానికి. అలాచేస్తే ఎప్పుడూ తనకొడుకు తన కళ్ళముందే వుంటాడన్న ఆనందం తనకుంది. అతని ఉద్యోగజీవితంలో పదేళ్ళు హాయిగా గడిచాయి. కోడలు పద్మని అణుకువగల పిల్ల. ఏ పొరపొచ్చాలూ లేకుండా రోజులు సాఫీగా గడిచిపోయాయి ఇంతవరకు. ఈలోగా ఇద్దరు మనుమలుకూడా కలిగారు ఇంటికి దీపాల్లా.

ఈనాడు ఇలా ట్రాన్స్‌ఫర్ మీద కొడుకువెళ్తూవుంటే భరించలేకపోయాడు రామ్మూర్తి. మళ్ళీ ఎందరినో ఆశ్రయించాడు. "ఈ సంవత్సరానికి ప్రమోషన్ వదులుకుంటే, వచ్చే సంవత్సరం ఇక్కడే ప్రమోషన్ వచ్చేలాచూస్తాను! ప్రస్తుతం ట్రాన్స్‌ఫర్ తప్పించడం కుదరదు." అన్నాడు ఆఫీసర్

నిరాశ చెందాడు రామ్మూర్తి

ఎన్నోవిధాల కొడుక్కి చెప్పిచూశాడు సుధాకరం మొండిపట్టు విడువలేదు న కంటే తరువాత వచ్చినవాళ్ళంతా ప్రమోషన్లమీద వెళ్ళిపోయారు వేనుమాత్ర




ఇలా వుండిపోయాను!" అని విసుక్కున్నారు

సావిత్రమ్మకి కూడా మనుమలు ఇంట్లో లేకపోవడంతో ఏమీ తోచడం లేదు, ఏ పనీ చేతపడడంలేదు వెనుక వెనుకే తిరిగే కోడలు, అనుక్షణం అది కావాలి, ఇదికావాలి అని వేధించే మనుమలు ఎప్పుడూ ఏదో సందడిగా వుండేది కాని ఇప్పుడు ఇల్లంతా వింత నిశ్శబ్దాన్ని సంతరించుకున్నది

"ఏమండీ కోడలికి నేనేం తక్కువ చేశానండీ?" ఆ పిల్లయినా ఇక్కడ వుందామని చెప్పలేదు అబ్బాయితో ఆ సుధాకరంకూడా మాటవరసకైనా "అమ్మా మళ్ళీ ఇక్కడికివచ్చేస్తాను! నువ్వు బెంగ పెట్టుకోకు" అన్నాడా? ఎంతయినా తల్లి మనసు తల్లికే తెలుస్తుంది అందుకే అన్నారు "రాయివంటి బిడ్డ లక్కవంటి తల్లి!" అని, భర్త కంచంలో అన్నం వడ్డిస్తూ అన్నది సావిత్రమ్మ

రామ్మూర్తి వేదాంతిలా నవ్వాడు

"సావిత్రీ ఇది లోకనైజం! పిల్లలకి రెక్కలొచ్చేవరకే తల్లితండ్రుల అవసరం వాళ్ళకుంటుంది ఆ తరువాత వాళ్ళు పక్షుల్లా ఎగిరిపోతారు" అన్నం పూర్తిగా తినకుండా కంచంలో చెయ్యి కడుక్కులేచాడు రామ్మూర్తి అతనికి అన్నం సహించలేదు రోజూ తనచుట్టూ కొడుకు మనుమలు కూచుని వుండేవారు నలుగురూ కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు ముగించేవారు కాని ఇప్పుడు ఈ ఒంటరితనం పీల్చి పిప్పిచేస్తున్నది అక్కడనుంచి ఆరుబైట వేసివున్న నవారు మంచంవైపు నడిచాడు రామ్మూర్తి

సావిత్రమ్మకి భర్త ఆవేదన తెలుసు ఆమెకి కూడా ఏమీ తినాలనిపించలేదు గ్లాసు మజ్జిగ మాత్రం తాగింది అంట్లూ ఎంగిళ్ళు పూర్తిచేసుకుని తనుకూడా ఆరుబయటకి వచ్చింది సావిత్రమ్మ

భర్త చుక్కల్ని లెక్కిస్తున్నాడు "ఏమండీ మనకి ఇది ఏనాటి శాపం? ఎవరిని మనం అన్యాయం చేశాం?" కన్నులలో నీరు సుడులు తిరుగుతుండగా అన్నది సావిత్రమ్మ

రామ్మూర్తి హృదయం ఎవరో సమ్మెటతో బాదినటనిపించింది "నిజం

ఇది... ఆ శాపమే!" అనాడు! తను ఎంత మొండిపట్టు పట్టాడు అనాడు రామ్మూర్తి కన్నులనుండి అవిరామంగా వర్షించసాగింది ... ఆ కన్నీటి వలయాలలో . గతం .. సినిమా రీల్లా తిరగ సాగింది.

కేశవపురంలో గోవిందయ్య పౌరోహిత్యం చేస్తూ వుండేవాడు అగ్రహారంలో అందరూ బ్రాహ్మణులే వాళ్ళ పిల్లలకి కూడా పౌరోహిత్యం నేర్పిస్తూ వంశపారంపర్యంగా తామే పౌరోహిత్యం నెరపుతున్నారు ఇలాంటి సమయంలో గోవిందయ్య తన కొడుకు రామ్మూర్తికి మాత్రం ఇంగ్లీషు చదువు చెప్పించాడు

పట్నంలో చదువుతున్నాడు రామ్మూర్తి ఫస్టుఛాన్సులో ఫస్టుక్లాసులో ఎస్ ఎల్. సి పాసయినాడు పరమానంద భరితుడైనాడు గోవిందయ్య తమ అగ్రహారంలో చదువుకున్నవాడు రామ్మూర్తి మాత్రమే పెద్దవాళ్ళ కాళ్ళు పట్టుకుని పట్నంలో ఉద్యోగం వేయించాడు కొడుక్కి గోవిందయ్యగారు నిజంగా అదృష్టవంతులు! కొడుకుని ఉద్యోగస్తుణ్ణి చేశారు! ఎన్ని పౌరోహిత్యాలు చేస్తే ఈసాటివస్తుంది?" అన్నారు అగ్రహారంలో అందరూ

"ఒరే అబ్బాయ్ మేమూ నీతోపట్నం వస్తామురా!" ఎన్నాళ్ళిలా పౌరోహిత్యం చేస్తూ ఈ పల్లెలో పడివుంటాము? అందరం కలిసేవుండొచ్చు!" అన్నాడు గోవిందయ్య రామ్మూర్తితో.

రామ్మూర్తికి తండ్రి మాటలు రుచించలేదు అప్పటికి సావిత్రి కాపురానికి వచ్చి ఆరునెలలయ్యింది పట్నంలో తామిద్దరు హాయిగా వుండే సినిమాలు షికార్లు చెయ్యవచ్చు! పల్లెటూరు ఛాందసాలు ఒంటపట్టించుకున్న తమ తల్లి దండ్రులు తమ స్వేచ్ఛకు భంగకారులు అవుతారేమో?" క్షణకాలం అలా ఆలోచిస్తూ వుండిపోయాడు రామ్మూర్తి. సావిత్రికూడా ఏమీ మాట్లాడలేదు.

గోవిందయ్య కొడుకువైపు ఆత్రుతగా చూడసాగేడు

కొంతసేపటికి రామ్మూర్తి అన్నాడు.

"నాన్నా మీరు ఆ పట్నంలో ఇరుకు గదులలో ఉండగలరా? పైగా మీకు ఇక్కడ వున్న గౌరవం అక్కడ లభించదు! అయినా మేము సెలవులు కలిసిన ఇక్కడికి వస్తూనే వుంటాంగా!" మీమడీ తడీ అక్కడ కుదరవు! మీరుకూడా ఆలోచించండి!"

కొడుకు అంతర్యం గ్రహించిన గోవిందయ్య మౌనం వహించాడు. కొడుకుతో మేము పట్నం వెళితే అగ్రహారీకులలో ఎంతో గొప్పగా వుంటుందని భావించాడు కాని ఆ ఆశ నిరాశ అయ్యింది

రామ్మూర్తి పట్నంలో కాపురం పెట్టాడు

అప్పుడప్పుడు సెలవులకి కేశవరపు అగ్రహారం వెళ్ళి వస్తున్నా మూడువంతుల కాలం పట్నంలోనే గడుపుతున్నాడు అప్పుడుకూడా తండ్రిని తనతో రమ్మన లేదు రామ్మూర్తి

కాలం జరిగిపోతోంది.

రామ్మూర్తి పట్నంలో డాబాఇల్లు కట్టాడు! కొడుకు సుధాకరం పెరిగి పెద్దవాడయ్యాడు సుధాకరానికి పెళ్ళి

యింది కోడలు వచ్చింది. మనుమలు కలిగారు అప్పుడుకూడా తండ్రివిరమ్మన లేదు రామ్మూర్తి అగ్రహారంలో దూరపు బంధువొకామె వండిపెడితే తింటున్నాడు గి విందయ్య

ఇప్పుడు సుధాకరం దూరంగా వెళ్ళిపోయాడు "ఇది ఎవరి శాపం? ఇది ఏ పితృహృదయం తాలూకు ఆవేదన. జీవితం పునరావృతం అవుతున్నదా?"

"ఏమండీ రామ్మూర్తిగారూ మీ అబ్బాయికి విజయవాడ బదిలీ అయ్యిందిట కదా?" పక్కయింటి పరంధామయ్య ప్రశ్నతో వాస్తవంలోకి వచ్చాడు రామ్మూర్తి

హృదయగతమైన బాధతో అతనికళ్ళు తడిసాయి ఇప్పుడు తండ్రి తనని క్షమిస్తాడా? సుధాకరం ఇలా వెళ్ళిపోయిన సంగతి చెప్తే తనని హేళన చెయ్యడూ? ఈ సంగతి ఆయనకి తెలియకూడదు!" దృఢమైన నిశ్చయం చోటు చేసుకుంది రామ్మూర్తిలో

సుధాకరం వెళ్ళిన వారంరోజులకి ఉత్తరం వచ్చింది ఓ మాదిరి ఇల్లు కుదిరిందనీ, అద్దె రెండువందల యాభై అనీ ఆఫీసుకి ఇంటికి చాలా దూరం అనీ, రోజూ సిటీబస్సులో వెళుతున్నాననీ రాసేడు

రామ్మూర్తి హృదయం బాధతో బరువెక్కింది ఇక్కడ ఎంత సుఖంగా వుండేవాడు సుధాకరం కడుపులో చల్ల కదలకుండా హాయిగా గడిచిపోయేవి రోజులు కాని తనుమాత్రం ఏంచెయ్యగలడు? సుధాకరంది మొండిపట్టుదల. చెప్పినమాట వినడు!

రాస్తున్నాడు సుధాకరానికి

మనుమలు లేని వెల్తి కొట్టవచ్చినట్టు కనుపిస్తున్నది అది కావాలి! ఇదికావాలి అని అల్లరిచేసే మనుమలు లేకపోవడం ఇల్లు నిశ్శబ్దంగా వుంది ఎక్కడివస్తువులు అక్కడేవుంటున్నాయి ఇదివరలో అయితే వాళ్ళు చిందర వందర చేసేవారు కోడలుపిల్ల తనకి ఏ క్షణంలో ఏదికావాలో అమర్చిపెట్టేది కాని ఇప్పుడు సావిత్రి ప్రతిదానికీ విసుక్కుంటున్నది ఇది సావిత్రి తప్పుకాదు. వయస్సు మీద పడుతున్నకొద్దీ ప్రతివాళ్ళకి ఎదురయ్యే సమస్యలే ఇవి


రామ్మూర్తికి రోజులు నిర్లిప్తంగా వున్నట్టనిపిస్తున్నాయి పోనీ సావిత్రీ తను ఈ ఇల్లు అద్దెకిచ్చేసి విజయవాడ కొడుకుదగ్గరకెళ్తే?" ఆ మాటే అన్నాడు సావిత్రమ్మతో

సావిత్రమ్మకూడా కొడుకుదగ్గరకెళ్ళడానికి ఉత్సుకత చూపించింది

మర్నాడు సుధాకరానికి ఉత్తరం రాసి పడేశాడు "వెంటనే జవాబురాయి! నువ్వు ఎప్పుడు బయలుదేరి రమ్మంటే అప్పుడు బయలుదేరుతాము నువ్వు ఆ రోజు స్టేషన్‌కి రావచ్చు!" అంటూ.

రోజులు దొర్లుతున్నాయి

సుధాకరం ఉత్తరం కోసం ఎదురు చూడసాగేడు రామ్మూర్తి ఓ రోజు రామ్మూర్తి ఏదోపనిలో వుండగావచ్చింది సుధాకరం దగ్గరనుంచి ఉత్తరం రామ్మూర్తి కళ్ళు ఆనందంతో వెలిగాయి "వాడు నా కొడుకు! అనుకున్నాడు గర్వంగా 'ఏంరాసుంటాడు?'




నాన్నగారూ మీరు అమ్మా వెంటనే బయలుదేరిరండి! అనిరాసుంటాడా? క్రితం రోజే చెప్పాడు తెలిసినవాళ్ళకి త్వరలో నేను మా అబ్బాయి దగ్గర కెళ్ళిపోతున్నాను! ఇల్లు ఎవరికైనాకా వలిస్తే అద్దెకిస్తాను! అని ఇవాళ సుధా కరంనించి ఉత్తరం వచ్చింది

"ఏమోయ్ సావిత్రీ నీ సుపుత్రుడు ఉత్తరం రాశాడు!" ఇలారా! అంటూ కేకేసాడు భార్యని ఉద్దేశ్యించి

తడి చేతులు గుడ్డకి తుడుచుకుంటూ వచ్చింది సావిత్రమ్మ.

ఉత్తరం చదవడం మొదలెట్టాడు రామూర్తి పూజ్యులైన నాన్నగారికి నమస్కారాలు

మీరురాసిన ఉత్తరం అందినది సంగతులు బోధపడినవి మీరు ఇక్కడికి వస్తారని రాసినారు "ఈ నిర్ణయం మీరు ఎందుకు తీసుకున్నారో నాకు అర్థం కావడంలేదు" ఈ నెల నించి మాకు ఇంటి అద్దె వందరు పాయలు పెంచి నారు! 'ఈ ఇరుకు గదులలో మేమే నానా అవస్థాపడుతున్నాము ఇక్కడ అన్నీ ఖరీదు ఎక్కువ' ఇలాంటి పరిస్థి తులలో మీరు ఇక్కడకు వచ్చి ఏం సుఖపడతారు? "మీరు ఆస్వంత ఇంట్లో అక్కడే హాయిగా వుంటే మంచిది! మీ కోడలు ఆరోగ్యం కూడా అంత బాగుండడంలేదు! మీ మనవలు మిమ్మల్ని అడిగినట్లు రాయమన్నారు! ఇలా రాసినందుకు నన్ను అన్యథా భావించవద్దు!

ఇట్లు
మీ కొడుకు
సుధాకరం

ఉత్తరం చదవడం ముగించిన రామూర్తి హతాశుడయ్యాడు ఎవరో కొరడాతో ఛళ్ళున చరిచినట్లయ్యింది "సుధాకరం ఎంత మారిపోయాడు?" అవమానభారంతో అతని హృదయం పరితపించింది తను సుధాకరాన్ని ఎలా పెంచాడు? ఏది కావాలంటే అది కొని పెట్టాడు బిడ్డలు తల్లితండ్రులకిచ్చే బహుమతులు ఇవేనా?, వెచ్చని నీటి బిందువులు జారాయి అతని కన్నులనుండి

"చూశావా సావిత్రీ నీ కొడుకు ఎలా రాశాడో ?" ఈ నాటికి వాడికి మనం ఎందుకూ పనికి రానివాళ్ళమయ్యాము! అతని గొంతులో జీరధ్వనించింది.


మనం బాధపడి ప్రయోజనం లేదండీ వాడికి రెక్కలు వచ్చాయి. వాడు ఎగిరి పోయాడు! మళ్ళా ఎప్పుడైనా వాడు ఈ గూడు చేరుతాడోలేదో ? భవిష్యత్తుని ఎవరూ నిర్ణయించలేరు! మనం దైవం మీద భారంచేసి జీవితాన్ని వెళ్ళదియ్యవలసిందే! అంది సావిత్రమ్మ కొంగుతో కళ్లు ఒత్తుకుంటూ. ఆమెకీ బాధగానే వుంది కొడుకు ప్రవర్తన.


రామ్మూర్తి కొడుకు దగ్గరకెళ్ళే ప్రయత్నం మానుకున్నాడు. ఖాళీ సమయాలలో పురాణ పఠనంలో కాలం వెళ్ళదీస్తున్నాడు. అప్పుడప్పుడు సుధాకరం దగ్గరనించి క్షేమంతో ఉత్తరాలు వస్తున్నాయి. సుధాకరం ఇప్పుడు డబ్బు కూడా పంపించడంలేదు. వాడికేం ఇబ్బందులో ? అనుకుంటూ వుండేవారు తల్లితండ్రు లిద్దరు. అప్పుడప్పుడు కేశవపురం నించి కూడా ఉత్తరాలు వస్తున్నాయి. రామ్మూర్తికి కేశవపురం కూడా వెళ్ళాలనిపించడంలేదు.

ఆరోజు సుధాకరం పుట్టినరోజు ఏమోయ్ సావిత్రీ వాడికిష్టమైన సేమియా పాయసం చెయ్యి! నేను వెళ్ళి దేవాలయంలో వాడిపేరు మీద అర్చన చేయించివస్తాను! అన్నాడు రామ్మూర్తి గుడికి బయలుదేరుతూ.

సేమియా పాయసం చెయ్యడంలో నిమగ్నురాలయ్యింది సావిత్రమ్మ. సుధాకరం ఇక్కడుంటే తనని ఇలా బ్రతకనిచ్చేవాడా ? పుట్టినరోజు నాడు ఎంత హంగామా హడావిడీ చేసేవాడు! సేమ్యా పాయసం మళ్ళామళ్ళా వేయించుకుతినేవాడు. డాడీ పుట్టినరోజు అంటూ పిల్లలు సంబరపడిపోయేవారు సినిమాలు సరదాలు ఎంత ఆనందంగా వుండేవి ఆ రోజులు! సావిత్రమ్మ కళ్ళు చెమర్చాయి

భర్త కంచంలో అన్నం వడ్డించింది సావిత్రమ్మ. ఏమండీ మన దగ్గర వుండాలనిపించలేదా వాడికి ? సజల నయనాలతో ప్రశ్నిస్తున్న భార్యకేం సమాధానం చెప్పాలో బోధపడలేదు రామ్మూర్తికి మరికొంచెం పాయసం






వద్దంటు సావిత్రీ! అన్నాడు ప్రసంగం మార్చే" ధోరణిలో పెదవులు దాటిరాని ఆవేదన అతని అంతరంగంలో సుళ్లు తిరిగింది.

ఇద్దరూ మౌనంగా భోజనాలు చేస్తున్నారు. ఇంతలో వీధిలో రిక్షాలు ఆగిన శబ్దం అయి అటు చూశాడు. రామూర్తి.

రిక్షాలోంచే సుధాకరం దిగి పిల్లల్ని దింపుతున్నాడు వెనువెంటనే పద్మినికూడా దిగి లోపలికి సామాన్లు పంపిస్తున్నది.

ఆశ్చర్యంగా హడావిడిగా వీధిలో వచ్చాడు రామూర్తి చంపకుని

సామాన్లన్నీ తెక్కమూసుకొని లోపలికి నడిచారు సుధాకరం భార్యాపిల్లలు అంతా.

పరస్పరం కుశల ప్రశ్నలయ్యాయి.

ఇప్పుడు ఇల్లు కళకళలాడుతున్నది.

తరువాత అసలు విషయం బయట పెట్టాడు సుధాకరం. "నాన్నగారూ నా మట్టుకి నాకు విజయవాడ ఏమీ బాగా లేదు" "పిల్లలు పాడయి పోయారు. మీ కోడలు ఆరోగ్యం చెడిపోయింది." అందుచేత మళ్ళీ ఈ ఊరు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను' అన్నాడు తలవంచుకుని.

రామ్మూర్తి హృదయంగాలిలో తేలిపోయింది. "జానమ్మా సున్నుండలు చెయ్యావూ! పిల్లలు వంట ఇంట్లోచేరి మారాం చేస్తున్నారు.

మళ్ళీ ఆ ఇంట్లో ఆనందం వెల్లి విరిసింది.

నాలుగు రోజులు సరదాగా గడిచాయి.

ఆ రోజు ఉదయం రామూర్తి స్నానాదికాలు ముగించుకుని ఎక్కడికో వెళ్ళడానికి తయారవుతున్నాడు.

"ఎక్కడికి నాన్నగారూ ప్రయాణం?"

కాఫీ తాగుతూ ప్రశ్నించాడు సుధాకరం

కేశవపురం వెళ్తున్నానురా సుధా! "తాతయ్యని ఇక్కడికి తీసుకువస్తాను!" ఈ వయస్సులో ఆయన ఒంటరిగా ఆ అగ్రహారంలో "ఎలా వుంటాడు? ఇటుపై ఆయన మనతోనే వుంటాడు" అంటూ వీధిలోకి నడిచి ఖాళీ రిక్షా ఒకటి ఆపి అందులోకి ఎక్కి బస్సు స్టాండువైపుగా పోనిమ్మన్నాడు రామ్మూర్తి. ●